క్లుప్తంగా

కూలి రూ.300 ఇవ్వాలి



నిజామాబాద్‌రూరల్: ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 తగ్గకుండా ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా సీనియర్ నాయకులు ఎం. వెంకన్న డిమాండ్ చేశారు. మోపాల్ మండలంలో గురువారం ఆయన ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపు సాయగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇచ్చి సంవత్సరానికి 250 రోజులు పని కల్పించాలని, కొలతలు లేకుండా పని ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు దండు గంగమల్లు, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ముస్తాబాద్ సాయిబాబాగౌడ్, గంగారాం, రాజు, సవిత, సాయిలు, గంగాధర్, గంగామణి, రాజామణి, కూలీలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



ఖలీల్‌వాడి: ఇటీవల సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న పలువురు బాధితులకు గురువారం నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో వారి ఫోన్లను ఎస్సై ప్రవీణ్ అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ ద్వారా 3ఫోన్లను రికవరీ చేశామన్నారు. వాటిని సంబంధిత వ్యక్తులకు అప్పగించినట్లు తెలిపారు.

డొనేషన్లు వసూలు చేయొద్దు

నిజామాబాద్‌అర్బన్: ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు వసూలు చేయరాదని, ఒకవేళ చేస్తే భౌతిక దాడులకు దిగుతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలను వసూలు చేస్తున్నారన్నారు. ఇలాంటివి సంఘం దృష్టికి వస్తే ఆయా పాఠశాలలపై దాడులకు దిగుతామన్నారు. విద్యాశాఖ అధికారులు డొనేషన్లు వసూలు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అనుమతులు లేని బడులపైన కూడా చర్యలు తీసుకొని, యజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు కుషాల్, నవీన్, వంశీ, టోకు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు



జక్రాన్‌పల్లి: గ్రామీణ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని ఏఎస్సై సుశీల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ టీవీ కెమెరాల ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. సిబ్బంది శ్రీనివాస్, భూపతి, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రెసిడెంట్‌గా రమేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ ప్రసిడెంట్‌గా రాజు, స్వామి, జనరల్ సెక్రటరీగా లక్ష్మణాచారి, సెక్రటరీగా లక్ష్మణ్, ట్రెజరర్ మహేందర్‌గౌడ్లా, సభ్యులుగా పుట్టరాము, పవన్‌రాజ్, దౌలత్‌సింగ్ తదితరులు ఎన్నికయ్యారు.

మట్టి కుండకు మస్త్ డిమాండ్!

- వేసవిలో కుండలోని నీరు తాగితే శరీరానికి చల్లదనంతోపాటు ఆరోగ్యం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న జనం



వేసవిలో దాహం వేసినపుడు, ఎండవేడిమి నుంచి ఉపశమనం కోసం చాలామంది చల్లనినీరు తాగడానికి ఇష్టపడతారు. ప్రస్తుతం ఫ్రిజ్‌ల ద్వారా చల్లని నీరు అందుబాటులో ఉంటున్నా.. మట్టికుండలోని నీటికే ప్రజలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎందుకంటే మట్టికుండలో నీళ్లు తాగితే శరీరానికి చల్లదనం, ఆరోగ్యం లభిస్తుంది. దీంతో మామూలు రోజుల్లో కన్నా వేసవిలో మార్కెట్‌లో కుండలు, రంజన్లకు భలే గిరాకీ ఉంటుంది.

– నిజామాబాద్ రూరల్

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో..

నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద, పులాంగ్ చౌరస్తా, వీక్లీబజార్, వర్ని చౌరస్తా, దుబ్బ, పాత గంజ్ కమాన్‌తోపాటు ప్రధాన ప్రాంతాల్లో మట్టి కుండలు, రంజన్‌లను విక్రయదారులు ఎక్కువగా అమ్ముతున్నారు. అన్ని కాలాల్లోనూ రజన్ల అమ్మకాలు ఉంటాయని, కానీ వేసవిలో అధికంగా విక్రయాలు జరుగుతాయని యజమానులు తెలుపుతున్నారు. రంజన్‌లను రాయ్‌పూర్ రాజస్థాన్, ఆదిలాబాద్, ఎల్లారెడ్డి నుంచి దిగుమతి చేసుకుంటున్నామని అమ్మకందారులు పేర్కొంటున్నారు. నల్లాలతో ఉన్న మట్టి కుండలు, రంజన్లను ఎక్కువగా కొంటున్నారన్నారు. రంజన్ సైజును బట్టి రూ.150 నుంచి రూ.350వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో చల్లనినీటి కోసం పేద, మధ్యతరగతి ప్రజలు కుండలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఇరవైఏళ్లుగా ఇదే వృత్తి..



జిల్లాలో స్థానికంగా కుమ్మరులు ఎవరూ రంజన్‌లు (కుండలను) తయారు చేయడంలేదు. నేను రాయ్‌చూర్, రాజస్థాన్, ఆదిలాబాద్, ఎల్లారెడ్డి నుంచి కుండలను దిగుమతి చేసుకొని అమ్ముతాను. జిల్లా కేంద్రంలో గత 20 సంవత్సరాలుగా కుండలను అమ్ముతున్నాను. మూడు కాలాల్లో గిరాకీ ఉంటున్నా, వేసవిలో అధికంగా ఉంటుంది. రోజుకు 100 కుండలను అమ్ముతాను. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.350 వరకు కుండలు అందుబాటులో ఉన్నాయి.

–రాజేశ్వర్, రంజన్‌ల విక్రయదారుడు, నిజామాబాద్



నగరంలోని బస్టాండ్ ప్రాంతంలో అమ్మకానికి ఉన్న రంజన్లు



కుండను కొనుగోలు చేస్తున్న యువకుడు

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలిసి, అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్, ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉద్యోగ మిత్రులకు, కలెక్టర్ ప్రత్యేక చొరవతో అన్ని రకాల వసతులతోపాటు, భోజన సదుపాయాలు అద్భుతంగా కల్పించారన్నారు. దీంతో ఆయనను సన్మానించినట్లు తెలిపారు. జిల్లా చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో నెలరోజుల పాటు ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ ఉద్యోగులకు చెల్లించిన విధంగా ఒక నెల వేతనం చెల్లించవలసిందిగా కోరారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. వైస్‌చైర్మన్ అమత్‌కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, దేవిసింగ్, ఆకుల ప్రసాద్, పురుషోత్తం, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, సత్యం, ఉమా కిరణ్ ,తదితరులు ఉన్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా కమిటీ సభ్యులు కూడా కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడంలో ఉపాధ్యాయుల కృషి కూడా విలువైనదని, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యానంద్, రమేష్, ట్రెజరర్ మల్లేష్, కార్యదర్శులు గంగాధర్, రాజారామ్, ఆనందం, సభ్యులు శ్రీనివాస్, సాన్‌పెట్ గంగాధర్, భాజన్న, శంకర్, రవీందర్, కపిల్‌దేవ్ పాల్గొన్నారు.

19న ప్రతిభ పురస్కారాలు ప్రదానం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల బస్వాగార్డెన్స్‌లో ఈనెల 19న పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కొండా లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట దత్తాద్రి, బూస రవి, కోశాధికారి బీమర్తి సురేందర్ పేర్కొన్నారు. ఈమేరకు నగరంలో కమిటీ కార్యాలయంలో గురువారం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ మెమోలు, ఆధార్‌జిరాక్స్ పత్రాలు, సంఘం తరపు లేఖ తీసుకొనిరావాలన్నారు. సభ్యులు కురపాటి గంగాధర్, ఎనుగందుల మురళి, సత్యపాల్, బిల్ల మహేశ్, బీమర్తి రవి, నారాయణ, బాస ప్రకాష్, బూస శ్రీనివాస్, లోల రాజేందర్, రచ్చ ఆంజనేయులు ఉన్నారు.

శానిటేషన్‌లో ఇష్టారాజ్యంగా విధులు



- రాకున్నా వచ్చినట్లు హాజరు, జీతాల చెల్లింపులు
- పర్యవేక్షించని ఉన్నతాధికారులు

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్‌లోని శానిటేషన్ విభాగంలో కార్మికులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎవరు ఎప్పుడు విధులకు హాజరవుతారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కొంతమంది అధికారులు వారికి నచ్చిన, అనుకూలంగా ఉన్న కార్మికులు విధులకు రాకున్నా హాజరు వేసి మరీ జీతాలు చెల్లిస్తున్నారు. నచ్చకుంటే పని ఒత్తిడి చేయడంతో పాటు వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో పలువురు కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

నగర మున్సిపల్ పరిధిలో ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. ఇందులో జోన్-1(నాందేవాడ), జోన్-2(గోల్‌హనుమాన్), జోన్-3(పెద్దబజార్), జోన్-4ఎ(రాజీవ్‌గాంధీ ఆడిటోరియం), జోన్-4బి(కంఠేశ్వర్), జోన్-5(అర్సపల్లి)లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో సుమారు 220 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. నగరమంతా సుమారుగా 1200లకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. అంతేకాక ఆయా జోన్‌లో డివిజన్‌కు ఒక జవాన్ చొప్పున ఉన్నారు. జవాన్‌లు కార్మికులతో పనులు చేయిస్తున్నారు. వీరిపైన జోన్‌లకు సంబంధించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేస్తుంటారు. కానీ పైఅధికారులు కార్మికుల్లో ఎవరైనా బంధులు, దగ్గరి సన్నిహిత్యం ఉంటే అట్టి కార్మికులు విధులకు రాకున్నా వచ్చినట్లు హాజరు వేయడం పరిపాటిగా మారింది. నచ్చని కార్మికులు ఉంటే ఎంత పక్కాగా విధులు నిర్వహించినా చీవాట్లు పెట్టడమే కాకుండా వేధింపులకు గురిచేస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నగరంలోని ఓ డివిజన్‌కు చెందిన వివేక్(పేరుమార్చం) ఓ జోన్ పరిధిలో మున్సిపల్ కార్మికుడిగా రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్నాడు. అయినా శానిటేషన్ కిందిస్థాయి అధికారుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అదే జోన్‌లో కిందిస్థాయి అధికారికి బంధువు, తెలిసిన వారుంటే వారు విధులకు రాకున్నా జీతాలు ఇస్తున్నారు. దీంతో వివేక్ లాంటి ఎంతో మంది కార్మికులు క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తున్నా, ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అందరూ విధులు నిర్వహించాల్సిందే..

మున్సిపల్ కార్మికులను ఎవరు కూడా వేధింపులకు గురిచేయవద్దు. ఖచ్చితంగా అందరూ విధులు నిర్వహించాల్సిందే. విధుల విషయంలో తారతమ్య బేధాలు చూడవద్దు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు ఉంటాయి.

– సాజీద్‌అలీ, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

బాల్కొండ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో కమ్యునిటీ పోలీసింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ వితరణ



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ దుబ్బాక లక్ష్మీకి గురువారం కాంగ్రెస్ బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి గ్యామ శోభన్ సిలిండర్‌ను వితరణ చేశారు. గ్యాస్ కనెక్షన్ పత్రాలను అందజేశారు. శోభన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో గ్రామంలో పేదవారికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తానని తెలిపారు. నాయకులు వంచ మహేష్‌రెడ్డి, ఆసిఫ్, దిగంబర్, ప్రేమ్, భాస్కర్‌రెడ్డి, జేజీఆర్ ఉన్నారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



నిజామాబాద్‌నాగారం: సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని, ఎన్నికల కోడ్ ముగియగానే రైతులకు రూ. 2లక్షల రుణామాఫీ చేయడానికి కసరత్తులు చేస్తున్నారని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న అన్నారు. రుణమాఫీ విషయంలో సీఎం ప్రత్యేకంగా బ్యాంకు అధికారులతో మాట్లాడి ముందడుగు వేసిన సందర్బంగా ఆయనకు ధన్యవాధములు తెలిపారు. నగరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా ఇచ్చిన మాట ప్రకారం సీఎం కృషి చేస్తున్నారన్నారు. వరి ధాన్యం కొనుగొలు పకడ్బందీగా చేపట్టారన్నారు. రైతులు పండించిన పంటకు రూ.500బోనస్, మద్దతు ధర ఇస్తామన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. బాడ్సి పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న డ్రెయినేజీ మురికినీటితో నిండిపోయింది. దీనికితోడు చిన్నపాటి వర్షానికే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీరు నిలిచిఉంటుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



రైల్వేస్టేషన్ రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

డెంగీ వ్యాధితో జాగ్రత్తగా ఉండాలి

సిరికొండ: డెంగీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి అర్వింద్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీహెచ్‌వో అనంత్‌రావు, రమేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలో గురువారం జాతీయ డెంగీ దినం సందర్బంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలకృష్ణ, మెడికల్ ఆఫీసర్ సుశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి రాకుండా, దోమ తెరలు వాడాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



సిరికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు

ఆధ్యాత్మికం..

18న వాసవీమాత జయంతి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కిసాన్‌గంజ్‌లో గల కన్యకాపరమేశ్వరీమాత ఆలయంలో ఈనెల 18న వాసవీమాత జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, వాసవీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఇందూరు అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తంగుప్తా, అల్లాడి రాజు, కోశాధి కారి సంతోష్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో డోలారోహణం, నామకరణం, పంచామృతాభిషేకాలు, మంగళహారతులు సమర్పించనున్నట్లు తెలిపారు. పెద్దరాంమందిర్ నుంచి కిసాన్‌గంజ్ వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

19న పాలీసెట్ మాక్‌టెస్ట్

నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఈనెల 19న పాలీసెట్ మాక్‌టెస్ట్ ఉచితంగా నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ సునీల్ పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఉచిత పాలిటెక్నిక్ మాక్ టెస్ట్ ఏర్పాటు చేశామని, పాలీసెట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మాక్ టెస్ట్ ప్రారంభమవుతుందన్నారు. నాయకులు సాయి, బాలకృష్ణ, దుర్గాదాస్, విగ్నేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,400	వెండి (కిలో)	87,500
22 క్యారెట్స్	67,710	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	25	గాజరుగడ్డ	35	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	130	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రతినిధి-2 (తెలుగు) - 10.45, 4.30, 10.30 కృష్ణమ్మ(తెలుగు)- 1.35, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-7.30
స్క్రీన్-2	ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు) - 1.40 బాక్(తెలుగు) - 4.30 కృష్ణమ్మ (తెలుగు) - 7.30, 10.30
స్క్రీన్-3	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లీష్) - 10.50, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 1.45, 4.40, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 1.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.40, బ్రహ్మాచారి (తెలుగు) - 10.15
స్క్రీన్-2	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 11.45, 2.55, 6.05, 10.15
స్క్రీన్-3	ప్రతినిధి 2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
స్క్రీన్ -4	కృష్ణమ్మ (తెలుగు) - 12.45, 3.40, 6.35, 9.30
దేవి	టీల్లు స్క్వేర్ (తెలుగు) - 11.15, 2.15 ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 6.15, 9.15
నటరాజ్	కింగ్ డమ్ ఆఫ్‌ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు)
లలితామహల్	ప్రతినిధి 2 (తెలుగు)
విజయ్	కృష్ణమ్మ (తెలుగు)